

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర

సంపుటి : 4 సంచిక : 27 పుష్పం :33 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)



**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 27-3-99, జిన్నూరు)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సాధనా బలం ఉంటే గాని వాసనాబలం తగ్గదు, పునర్జన్మ హేతువులు నశించవు. మనం బాధ్యతగా పనిచేస్తున్నప్పుడు మనకు ఉపయోగపడే తలంపులు వస్తాయి. అవి మీకు, మీ కుటుంబానికి, సమాజానికి ఉపయోగపడతాయి. మనం ఏదైనా ఒకమాట మాట్లాడినా, ఏదైనా ఒకపని చేసినా సామాజిక స్పృహతో మాట్లాడాలి, సామాజిక స్పృహతో పనిచేయాలి. అలాచేస్తే మన చైతన్యస్థాయి పెరుగుతుంది అంటే మన హృదయంలో ఉన్న చైతన్యంతో ఏకత్వం వస్తుంది. భగవంతుని అవతారములలో ఒక రూపాన్ని తీసుకొని ధ్యానం చేసుకోవటం, నామాన్ని తీసుకొని స్మరించుకోవటం నాకు అలవాటు. జ్ఞానం పొందటానికి ఇది ఉపయోగపడుతుందా అని ఒక భక్తుడు అడుగుతున్నాడు. భగవంతుడు సాకారమా, నిరాకారమా అంటే రెండూనూ సాకారంగా ఉండగలడు, నిరాకారంగా ఉండగలడు. భక్తులు సాకారమును ఎక్కువ అభిలషిస్తారు. మన ఉపాసనకు, భక్తికి ఒక సపోర్టు ఉండాలి. మూర్తి ధ్యానం, నామజపం ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావటానికి ఉపయోగపడతాయి.

ప్రతీ విషయం వింటున్నాను కాని మర్చిపోతున్నాను అని ఒక భక్తుడు అడుగుతున్నాడు. మీరు అన్ని విషయాలు జ్ఞాపకం పెటుకోనక్కరలేదు. జీవితంలో మనకు ఈ మాటలు ఉపయోగపడతాయి అనుకొనే కొన్ని మాటలు జ్ఞాపకం పెట్టుకొంటే చాలు. ఇవి మాకు జ్ఞాపకం ఉండాలి అని మీరు సంకల్పించుకొంటే జ్ఞాపకం ఉంటాయి. మనుషులను చూసేటప్పుడు మీరు ఆ మనిషిలో ఉన్న జీవుడిని చూడవద్దు, ఆ మనిషి యొక్క మనస్సును చూడవద్దు, మనస్సులో ఉన్న గుణాలను చూడవద్దు. వాడిలో ఉన్న నన్ను చూడండి అని భగవంతుడు చెపుతున్నాడు. నన్ను చూసి పని చేయటం నేర్చుకోండి అప్పుడు మీ మనస్సు చల్లబడుతుంది, మీకు అంతర్ దృష్టి కలుగుతుంది, మనస్సు నశిస్తుంది, అప్పుడు మనస్సు స్థానంలో చైతన్యం మీకు వ్యక్తమవుతుంది. నిరంతరము మీ గురించి మీరు ఆలోచించుకొంటారు. మీ గురించి మీరు ఎలా ఆలోచించుకొంటున్నారో అలాగ ఇతరుల గురించి మీరు ఆలోచించటం నేర్చుకొంటే నెమ్మదిగా మీరు పవిత్రులు అవుతారు. స్వార్థం లేకుండా పనిచేయటం వలన కూడా మానవులు పవిత్రులవుతారు. ఈ భూమి మీదకు వచ్చినందుకు ఎంతో కొంత పవిత్రత సంపాదించాలి. పవిత్రత సంపాదించకుండా శరీరం విడిచి పెట్టేస్తే మనం సాధించినది ఏమీ

ఉండదు.

మీరు ఎన్ని శాస్త్రాలు చదివినా, మహాత్ముల ప్రవచనాలు ఎన్ని విన్నా మనలో మార్పురావాలి, మన చైతన్య స్థాయి పెంచుకోవాలి. మనలో మార్పు వస్తేనే గాని మనకు తత్వం తెలియదు అని మీరు మారటం ప్రారంభిస్తే అప్పుడు గురువు అనుగ్రహం మీకు బాగా పనిచేస్తుంది. మీరు ఎన్ని విన్నా, ఎన్ని చదివినా నేను మారాలి అనే సంకల్పం కనుక మీకు లేకపోతే వాటి వలన ప్రయోజనం లేదు. ఉపాసన చేయకపోతే, ధ్యానం చేయకపోతే, విచారణ చేయకపోతే మనస్సు విషయాల మీదకు పోతుంది. విషయాలను ఎప్పుడైతే ధ్యానిస్తున్నావో వాటిని పొందాలని కోరిక పుడుతుంది, దానికోసం ప్రయత్నం చేస్తావు. కోరిక నెరవేరితే పొంగువస్తుంది, నెరవేరకపోతే కృంగిపోతావు. నెరవేరక పోవటం వలన కోపం వస్తుంది. ఇది మంచి, ఇది చెడు అనే విచక్షణ తగ్గిపోతుంది. మాటమాటకు ఉద్రేకం వస్తే భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను నష్టపోతావు. విషయాలను ధ్యానించటం వలన చివరకు నీవు పతనమవుతావు. శరీరం మరణించక ముందు అశాంతి, మరణించిన తరువాత చీకటి లోకాలు మిగులుతాయి. ఎప్పుడైతే ఆత్మధ్యానం, మూర్తి ధ్యానం విడిచి పెట్టావో నీ మనస్సు విషయాలను ధ్యానిస్తుంది, విషయ ప్రపంచంలో కూరుకొని పోతుంది. అందువలన మూర్తిధ్యానం మంచిదే. ఎప్పుడూ నీవు మూర్తిధ్యానం చేయుటం వలన నీ హృదయంలో నీ ఇష్ట దేవతను నింపుకోవటం వలన నీలో ఉన్న రాగద్వేషములకు, సంస్కారములకు మేత దొరకదు. మేత దొరకకపోవటంవలన ఇవి అన్నీ తగ్గిపోతాయి. నిరంతరము నీవు ఏకవస్తువును చింతిస్తూ ఉంటే లోపల వాసనకు బలం తగ్గిపోతుంది. ఎప్పుడైతే వాసనకు శక్తి తగ్గిపోయిందో అప్పుడు నీకు ఆందోళన రాదు, అశాంతి రాదు. తొందరపాటు పనులు చేయకూడదు. ఆలోచన లేకుండా చేసే పనులు, ఆలోచన లేకుండా మాట్లాడే మాటలు మనలను బంధిస్తాయి. ఏక వస్తువును చింతించటం ధ్యానం. ధ్యానం వలన వాసన నశిస్తుంది. భగవదనుభవం కలుగుతుంది. మన మాటలను విని భగవంతుడు మోసపోడు. ఆయన సర్వసాక్షి, ఎంత సాక్షి అంటే ఆయన మన నిద్రను కూడా చూస్తున్నాడు. మన నిద్రను చూసే వ్యక్తి మన మాటలను, చేతలను చూడకుండా ఎలా ఉంటాడు. ధ్యానం చేయగా చేయగా, అవతారపురుషులను స్మరించగా స్మరించగా, సత్పురుషులతో సహవాసం చేయగా, చేయగా దేహంతో తాదాప్యం పొందే నేను నశిస్తుంది, ఆత్మతో తాదాప్యం పొందే నేను ఉదయిస్తుంది. నీవు దేనికి అతిగా వెళ్ళవద్దు. మీరు మీ పని చేసుకోండి, నిర్మలంగా సహజంగా సాధన చేయండి. నెమ్మదిగా ఎదిగి రావాలి తొందరపడవద్దు. ప్రతీ చిన్నవిషయానికి భయపడటం వలన కూడా అజ్ఞానం పెరుగుతుంది. మీరు సొంతంగా ఆలోచించుకొంటూ ఆధ్యాత్మికంగా స్వతంత్రంగా నిలబడే శక్తి మీకు రావాలి. మీ శరీరం బలంగా ఉన్నా, బలహీనంగా ఉన్నా ఆధ్యాత్మిక బలం మీకు కలగాలి. ఆసక్తిని విడిచిపెట్టి మీరు పనిచేయండి. ఎ.సి గదిలో ఉన్నప్పుడు మీ శరీరం ఎలా ఉంటుందో ఆసక్తి విడిచిపెట్టి పని చేయటం మీరు నేర్చుకొంటే మీ మనస్సు, ఇంద్రియాలు అలాగ ఉంటాయి. ఎప్పుడూ పాజిటివ్‌గా ఆలోచించాలి, నెగిటివ్‌గా ఆలోచించకూడదు. ఎవరైనా ఏదైనా చెప్పినప్పుడు

మంచి మాటను తీసుకోవాలి, చెడ్డమాటను వదిలివేయాలి. చెడ్డమాట చెప్పిన వాడిని మనం ఏమీ విమర్శించనక్కరలేదు.

దుఃఖకారణం నీ లోపల ఉన్నంత సేపు ఏదో రూపంలో దుఃఖం వస్తుంది. ఇప్పడు లేకపోయినా వాయిదా పడుతోంది తరువాత అయినా వస్తుంది. అయితే నీలోపల ఎంత దుఃఖం ఉన్నప్పటికి నీవు ఎవరో నీకు తెలిస్తే ఆ దుఃఖం అంతా కూడ ఆనందంగా, శాంతిగా మారిపోతుంది. అది జ్ఞానం యొక్క వైభవం. నిరాకారం వారు, సాకారం వారు భక్తులే. ఆకారం లేని దానిని ధ్యానించటం కష్టమయితే సాకారాన్ని ధ్యానించుకో. మనం ఈదుకొని నదిని దాటవచ్చు, బోటు పై కూడా దాటవచ్చు. ఆకారంలేని వస్తువును పట్టుకొని ప్రయాణించటం నదిని ఈదుకొని దాటటం వంటిది. ఈదుకొని వెళ్ళే శక్తి అందరికి ఉండదు. ఇది కొంత కష్టం. సాకారమును పట్టుకొని ప్రయాణించటం బోటుపై నదిని దాటటం వంటిది. ఇది Safe side అని భగవంతుడు చెప్పాడు. ఇద్దరూ భక్తులే. పొందేస్థితి ఒక్కటే మార్గాలు తేడా అంతే. రూప బుద్ధి నామబుద్ధి ఎక్కువ ఉన్నవారికి సాకారం మంచిది, రూపబుద్ధి నామబుద్ధి తక్కువ ఉన్నవారికి నిరాకారం మంచిది. సాకార ధ్యానం చేయాలా, నిరాకార ధ్యానం చేయాలా అనేది ఇతరులు చెప్పేది కాదు. లోపల నీ అంతస్థు చూసుకొని, నీ గుణాన్ని బట్టి నీవు ఏ మార్గంలో ప్రయాణం చేయాలో నిర్ణయించుకో. నీవు తరించటం ముఖ్యం. ఒకసారి రవీంద్రనాద్ ఠాకూర్ గాంధీ గారి గురించి చెపుతూ ఈయన మనుషులను మార్చటం కోసం ప్రయత్నం చేస్తున్నాడు. మనుషులను మార్చటం అంత తేలిక కాదు. ఏదో వంతెన, భవనం కట్టమంటే కట్టవచ్చు కాని మానవస్వభావం మార్చటం చాలాకష్టం. ఈయన మనుషులను మార్చటానికి ప్రయత్నం చేసి ప్రయత్నం చేసి ఎవరినైతే మార్చటానికి ప్రయత్నం చేస్తున్నాడో వారు మారకపోయినా ఆయన మారిపోయి తరిస్తాడు అని ఠాకూర్ చెప్పాడు.

భగవంతుడు నీ హృదయంలో ఉన్నాడు. నీ మనస్సుకు స్థిరత్వం లేకపోవటం వలన ఆయన అందటం లేదు. నీ మనస్సుకు ఎప్పడైతే స్థిరత్వం వచ్చిందో నీ హృదయంలో ఉన్న ఈశ్వరుడు నీకు దొరుకుతాడు. ఆయన నీకు లభ్యమయినప్పడు నీకు కాలంతో సంబంధం లేదు, గడిచిపోయిన జన్మలు అన్నీ స్వప్నంతో సమానమని నీకు తెలుస్తుంది. అంతకు ముందు నీకు దుఃఖం వచ్చింది అనుకో భగవంతుడు వ్యక్తమయిన తరువాత ఈ దుఃఖం నిజం కాదు, ఇంతవరకు అజ్ఞానం వలన అకారణంగా దుఃఖ పడ్డాను అని నీకు అనిపిస్తుంది. నీవు చైతన్యంగా ఉండగలిగితే, ఆత్మగా ఉండగలిగితే, నామ రూపక్రియల నుండి విడుదల పొందితే నీకు నిజమైన మౌనం కలుగుతుంది. నీవు మనస్సుగా కాకుండా, దేహంగా కాకుండా, ఇంద్రియాలగా కాకుండా నీవు ఏదిగా ఉన్నావో ఆ చైతన్యంగా, ఆత్మగా ఉండి పోవటమే మౌనస్థితి. ఆ మౌనంలో నుండే అఖండమైన శాంతి పుట్టుకొని వస్తుంది. అప్పడు దేహం ఉన్నా లేకపోయినా, ప్రపంచం కనిపించినా కనిపించకపోయినా వీటికి సంబంధించిన భావన నీకు ఉండదు. నీకు మౌనస్థితి కలిగినప్పడు దేవునితో శారీరకంగా కాదు మానసిక అనుబంధం కలుగుతుంది, మానసిక పూజ చేస్తారు. నీకు మౌనస్థితి కలిగితే అదే విష్ణుభక్తి, అదే దైవభక్తి, అదే ఆత్మభక్తి. భగవంతునికి

తన్ను తాను అర్పించుకొనే కొలది నీకు శాంతి యొక్క లోతులు పెరుగుతాయి. భగవంతునికి శరణాగతి చెందిన వాడు మౌనంగా ఉంటాడు, భగవంతుడికి దాసుడుగా ఉంటాడు. సమాజానికి తన ద్వారా ఏదైనా జరిగినా తన ద్వారా భగవంతుడే ఆ పని చేసాడు అంటాడు.

నీవు ఒకటిగా ఉన్నావా? రెండుగా ఉన్నావా? మనందరము ఒకటిగా ఉన్నాము అని అనుకొంటున్నాము. ఆ ఒకటి ఏమిటో తెలుసుకోవటమే జ్ఞానం. మమ్మల్ని ఒకచోట కుదురుగా పడి ఉండమంటారా లేక పుణ్యక్షేత్రాలు దర్శించటం చేయమంటారా అని ఒక భక్తుడు అడుగుతున్నాడు. నీవు పుణ్యక్షేత్రాలు తిరిగినా, ఒకేచోట ఉన్నా నీమనస్సు మటుకు దేవుని మీద నిలబడి ఉండాలి. ఎక్కడికి వెళ్ళకుండా నీ మనస్సు ఈశ్వరుని మీద లగ్నం అయితే మంచిదే. అలాకాకుండా నేను రామేశ్వరం చూడాలి, కాశీ చూడాలి అనే కోరిక వస్తోంది అనుకో అప్పడు దేహాన్ని బలవంతంగా ఒకచోట పడేసి ఉంచటం కంటే చూసి వచ్చేయటం మంచిది. రహస్యం అంతా మనస్సులోనే ఉంది. నీ మనస్సు ఎంతవరకు పరమేశ్వరుని యందు నిలబడుతోంది అది ముఖ్యం. ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు. ఉన్నదానికి లేకపోటం అంటూ లేదు, లేనిదానికి ఉండటం అంటూలేదు అర్జునా అని చెప్పి ఇది నిశ్చయం అని భగవంతుడు చెప్పాడు.

నీవు కర్తృత్వం పెట్టుకొన్నా, కర్తృత్వం లేకుండా చేసినా నీ ద్వారా జరుగవలసిన పని జరిగిపోతూ ఉంటుంది. కర్తృత్వంతో చేస్తే బంధింపబడతావు. అదే పని కర్తృత్వం లేకుండా చేస్తే ఇహలోకంలో నీ పని నిర్మలంగా అయిపోతుంది, పరలోకంలో శాశ్వత స్థానమును పొందుతావు. కర్తృత్వం లేకుండా చేయటం వలన పని పూర్తి అవుతుంది. ఆ పని నీకు జ్ఞానం కలగటానికి సహకరిస్తుంది. నీవు పని చేయటం వలన టైర్ అవ్వవు, కర్తృత్వం పెట్టుకోవటం వలన టైర్ అవుతావు. కర్తృత్వం ఎప్పడైతే నశించిందో అప్పడు నీ హృదయంలో నుండి ఉదాత్తమైన, అభౌతికమైన జ్ఞానం వచ్చి నిన్ను ఆవరిస్తుంది. నీకు ఉత్తమశాంతి కలుగుతుంది. నీవు పని చెయ్యి, కర్త లేని కర్మను చెయ్యి అనే వారు భగవాన్. భగవంతుని కొరకు జీవించు, భగవంతుని కొరకు ఆలోచించు, భగవదనుభవం పొందటానికి ప్రయత్నం చెయ్యి. లోకం అంతా కూడా ఈశ్వరస్వరూపంగా చూడు. మీరు ఎవరికైనా ఏదైనా ఇచ్చినప్పడు జీవుడికి ఇచ్చాను అని అనుకోకు. వారిలో ఉన్న దేవుడికి ఇచ్చాను అనుకోండి. అందరి ఉపాధులలో ఉన్న నన్ను చూసి పని చెయ్యి. అలా చేస్తూ ఉంటే ఎటువంటి బుద్ధిని ఇస్తే మీకు జ్ఞానం కలుగుతుందో అటువంటి బుద్ధిని నేను నీకు ఇస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు. ఆ బుద్ధి వలన నీవు వస్తువును పొందుతావు. పనిలో కూడా దేవుని చూడండి. మీరు రోజూ చేసే పనులు హెచ్చు తగ్గులు లేకుండా చేయండి. అదే యోగం. నీవు ఎక్కడికి వెళ్ళినా లోకం ఉంటుంది. ఇక్కడ నుండి కాశీ వెళ్ళినా, బదరీ వెళ్ళినా లోకం ఉంటుంది. లోకం విడిచి పెట్టి ఎక్కడికి పారిపోతాము. లోకంలో ఉంటూనే తరించే ఉపాయం చూసుకోవాలి.

PRINTED & PUBLISHED BY P.S. RAMARAJU AT SHRIRAM GRAPHICS, PALAKOL ☎ 24776